
'ఎండకోసం వుండిపోతే కొడుకు సచ్చిపోతాడు. సావుకి జడ కండి బాబూ! వద్దన్నా రాక మానదు. రమ్మంటే రాదు' అది తాత ఉపదేశించిన జీవన సిద్ధాంతం.



# అగ్నినక్షత్రం

ఉపద్రష్టసాయి

మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటలు.

చైత్రమాసపు ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. గాలి వీచినపుడు ఒళ్ళంతా మండుతూంది. నల్లని తారు రోడ్డు మీద అల్లంత దూరంలో ఎండ మావులు కనిపిస్తున్నాయి. నిర్మానుష్యంగా నిర్జీవంగా వుంది ఆ రహదారి.

వర్షాలు లేనందువల్ల యెండిపోయిన పొలాలు చుట్టూ వల్లకాటిలా కనబడు తున్నాయి. కనుచూపు మేరకు చెట్టుగానీ, పుట్టగానీ కనిపించలేదు.

ప్రకృతికాంత తల విరగబోసుకుని ఏడుస్తున్నట్లుంది

ఊళ్ళో బావులూ, చెరువులూ అన్నీ దాదాపు యెండిపోయాయి. చేవ వున్నవాళ్ళు దూరాభారంవెళ్ళి నీళ్ళు కడవలతో మోసు కొస్తున్నారు చుట్టు ప్రక్కల వూళ్లనుంచి.

దూరంగా సుడిగాలి దుమారం లేచింది. ఇసుకరేణువులు దటంగాలేచి విలయ తాండవంచేసి మళ్ళీ భూమ్మీద వాలాయి

మరింత దూరంలో ఆకాశాన్ని చుంబిస్తూ కొండలు. కొండల అంచున పెద్ద బండరాళ్ళు. ఏ నిమిషం క్రిందికి దొర్లుతాయో అనేలా వున్నాయి అవి తర తరాలుగా.

రామారావు చేతిలోని పేపరుతో విసురు కుంటూ ఆ రహదారిలో వున్న చిన్న పూరి పాక నాకిట నిల్చున్నాడు విసుగ్గా. ఆ పాక ఒక టీ కొట్టు. ఎప్పుడైనా అటువైపు ఆగి సేద దీర్చుకునే లారీవాళ్ళకు ఆ పాకే ఆధారం ఇటు, అటు మైలుదూరం వరకు నిలువ నీడలేదు, ఆ పాక తప్ప.

ఒకటికాదు, రెండుకాదు, అయిదేళ్ళ యింది ఆ పాక అక్కడ వెలిసి. పగటి పూటపుడు అది టీ షాపు రాత్రిళ్ళు ఎవ రైనా లారీ వాళ్ళు వస్తే బుడ్డిల్లో దాచిన నాటుసారా అందిస్తాడు. అప్పన్న. బస్సులు. ఆ దారమ్మట రోజుకి రెండు సార్లు మాత్రమే వెళ్తాయి. డ్రైవర్. కండక్టర్ల అవసరాలను బట్టి అక్కడ అవి ఆగుతాయి. లారీలు మాత్రం చాలా మట్టుకు ఆదారమ్మట వెళ్ళినప్పుడు ఆగు తాయి. అందువలే ఆ పూరిపాక గొప్పగా ఎదగకపోయినా ఐదేళ్ళయినా నిలదొక్కుకో గలిగింది.

రెండు పిడికిళ్ళనిండా నిప్పులు చెరుగు తూంది ప్రకృతి కాంత.

'ప్చ్' అనుకుంటూ నిరాశతో చొక్కా గుండీలు విప్పుకుంటూ రోడ్డు కేసి చూశాడు రామారావు.

"ఏం బాబూ! ఎంతసేపు ఇలా నిల్చుం టారు" అడిగాడు అప్పన్న....కాదు....ఆ టీకొట్టు యజమాని.

"చెప్పలేను ఎండ దంచేస్తుంది. బయట కాలు పెడితే యే నిమిషం చస్తానో తెలీదు. నిజంగా అప్పన్నా! వాన వచ్చినా ఫర్వా లేదు గొడుగు పట్టుకొని వెళ్ళచ్చు వెధవ ఎండ మల మల మాడ్చి చంపేస్తుందోయ్" అన్నాడు ఎండ, వానకన్నా భరించలేని దన్నట్లు.

"ఏటో! మీ పిచ్చిగానీ ఎండప్పుడు ఎండనీ, వానపుడు వాననీ వాపోతూ జీవిం చడం మానవ లక్షణం. కాలం దాపరించే దాకా ఎంత వానొచ్చినా, ఎండ కాచినా ప్రాణాలు పోవు. జీవితం జీవించడానికి— ఎండకూ, వానకూ తలొగ్గితే ఎప్పుడూ బతకలేం" అప్పన్న జీవితంమీద ఉప న్యాసం ఇస్తున్నాడు.

ఇంతలో కనుచూపు మేరలో ఒక సైకిలు కనబడింది. ఎవరో ఒక వ్యక్తి రొప్పుతూ ఆయాసంతో తొక్కలేక తొక్కుతూ మెల్లగా పాకదగ్గరికొచ్చాడు. ఒళ్ళంతా అప్పుడే స్నానంచేసినట్లు చెమట కారుతూంది. తల బాగా చెదిరి



శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ఆధ్వర్యంలో మాడపాటి సుకుమార్ స్మారక ఉపన్యాస సభలో ప్రసంగిస్తున్న ప్రధాన అతిథి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖామంత్రి శ్రీ జి.వి. సుధాకరరావు అధ్యక్షత వహించిన దాశరథి. భాషానిలయం కార్యదర్శి ఎం. ఎం. నరసింహారావు. డి. రామలింగంగార్లు

పోయింది. చొక్కా ముద్దయిపోయింది. రెండు చేతులూ వణుకుతున్నాయి కళ్ళు ఎర్రగా వున్నాయి.

అప్పన్న ఒక గ్లాసు మంచినీళ్ళు అడిగాడు అతను. ఎగవూపిరి తీసుకుంటూ. అప్పన్న గ్లాసుతో నీళ్ళిచ్చాడు. ఒక్క క్షణం అలా గ్లాసు పట్టుకుని రామారావుని చూసి గటగట నీళ్ళు తాగి పది పైసల నాణెం అందించాడు అతను. అప్పన్న ఆ నాణెం గల్లాపెట్టెలో పడేశాడు. ఒక నిమిషం ఎండ కేసి. ఆకాశం కేసి చూసి అతను వెళ్ళిపోయాడు మళ్ళీ రొప్పుతూ. సైకిలు తారు రోడ్డుమీద కిర్రుమంటూ తన బాధను వెళ్ళగక్కుతూంది.

చూస్తూ చూస్తూ మరో అరగంట అయింది "ఏం బాబూ వెళ్ళే యోచన లేదా?" అప్పన్న మళ్ళీ అడిగాడు.

"ఏం చెయ్యమంటావ్" "ఎండ ఎలా కాస్తుందో చూడు" అన్నాడు రామారావు.

అప్పన్న నవ్వి వూరుకున్నాడు

రామారావు మరో పది పైసలిచ్చి మరో గ్లాసు నీళ్ళు తాగాడు కాసేపయింది. రామారావు చూపు రోడ్డు మీద వుంది దాదాపు వంద గజాల దూరంలో ఒక ఆకారం మెల్లగా కదలడం కనబడింది. పోను పోను ఆ ఆకారం దగ్గర పడడంతో అదొక ముసలతని ఆకారం అని తెలిసింది. అతను తల నెరసిన పండు ముసలివాడు. ఒంటిమీద గోచితప్ప మరో బట్టలేదు. కాలికి చెప్పుల్లేవు.... నిజం.... చెప్పుల్లేవు. మెల్లగా నడుస్తున్నాడు ఒక చేతిలో చిన్న కుండ పెంకు; మరో చేతిలో వూత కర్ర. అతను జలగలా కదుల్తున్నాడు.

ఒకసారి వేడిగాలి వచ్చింది. రామారావు విసుక్కున్నాడు. మండుతున్న శరీరం మంటల్లో పడ్డట్టుంది.

మరో పది నిమిషాలకు ఆ వృద్ధుడు గుడిసె వాకిట్లోకి వచ్చాడు. ఆయాసంతో రొప్పుతూ.

"బాబూ!.... కొంచెం దాహం ఇప్పించండి బాబూ" అతను ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

"గ్లాసు పదిపైసలు తాతా! ఇవ్వగలవా?" అడిగాడు అప్పన్న

"ఇదా బాబూ" ఇదిగో ఇరవై పైసలు.. రెండు గ్లాసులు ఇవ్వండి బాబూ" అంటూ గోచిలోంచి రెండు పది పైసల నాణాలు తీసి అప్పన్నకు అందించాడు. అప్పన్న అందించిన నీళ్ళను జాగ్రత్తగా తను తెచ్చిన కుండపెంకులో పోసుకున్నాడు. అతను ఆ నీళ్ళను తాగకుండా కుండలో పోసుకోడం రామారావుకీ. అప్పన్నకూ ఆశ్చర్యం కలిగించింది కుండలో నీళ్ళు నింపగానే ఒక్కక్షణం అయినా కూర్చోకుండా మళ్ళీ నడవడం మొదలుపెట్టాడు ఆ ముసలతను.

అంతవరకు యెండ దెబ్బకు సోలిపోయిన రామారావు అతన్ని చూసి "తాతా! ఎందుకంత తొందర! ఇంత సేపు యెండలో పడి వచ్చావు. ఈ సారి యెండలో నడిచావంటే తప్పకుండా చచ్చిపోతావు. కాసేపాగు. మరో గంటకు ఎండ తగ్గుతుంది. అప్పుడు వెళ్దువుగాని" అన్నాడు.

తాత రామారావును చూసి చేత్తో నుదుటిమీది చెమట తుడుచుకుంటూ "ఎండ తగ్గేవరకు ప్రాణం ఆగదు బాబూ! మా పెద్దోడు జ్వరంతో సావు బతుకులమధ్య పడుకున్నాడు. ఈ నీళ్ళిట్టికెళ్ళి కిసింత గంజెడితేగాని ఎండ దెబ్బకు తట్టుకోలేడు. నాదేముంది బాబూ! అన్నీ అయిపోయిన వాడ్ని. కాటికి కాలు సాపుకున్నా. ఇల్లు చేరితే వాడదృష్టం చేరకపోతే దురదృష్టం. అంతేగానీ యెండకోసం వుండిపోతే కొడుకు సచ్చిపోతాడు. సావుకి జడవకండి బాబూ!" వద్దన్నా రాకమానదు రమ్మంటే రాదు" అని జీవన సిద్ధాంతాన్ని రామారావుతో చెప్పి అతను వెళ్ళిపోయాడు; యెండలో.... పిండారబోసిన యెండలో.

ఆకాశం మెరుగు పూసిన వెండిపళ్ళెంలా మెరుస్తూంది. కొంచెం కొంచెంగా ఆ ముసలివాడు దూరమవుతున్నాడు. చూస్తుండగానే కాసేపట్లో కనుమరుగయ్యాడు అతను మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ.

మళ్ళీ రహదారి నిర్జీవమైంది. నిశ్శబ్దంగా వుంది- ఒక లారీ ఆగకుండా వెళ్ళిపోయింది.

దూరంగా ఒక కాకి గిలగిల తన్నుకుంటూంది నేల మీద.

రామారావు చేతి వేళ్ళు అప్రయత్నంగా పాంటు జేబులో ప్రిస్క్రిప్షన్ మీద పడింది. మరోసారి ఆ కాయితం తీసి చదువుకున్నాడు. చదువుతున్నప్పుడు ప్రిస్క్రిప్షన్లో అక్షరాలకు బదులు డాకరు కనబడ్డాడు. "వీలైనంత తొందరగా తెండి. ఇక్కడ దొరక్కపోతే మరెక్కడైనా ప్రయత్నించండి. పట్నం వెళ్ళండి" "ఆయన్ను బ్రతికించ గలిగేది ఈ మందు ఒక్కటె...." అంటూ.

రామారావు మనసులో ముసలితాత కొడుకుమీద చూపించిన అనురాగం మెదిలింది. ఒక్కక్షణం అనుకున్నాడు- "తండ్రులు పిల్లలమీద చూపించే ఈ అనురాగం ఎన్ని జన్మలు సేవచేసినా తీర్చబడని ఋణం" అని.

రామారావు అప్రయత్నంగా అప్పన్నతో కూడా చెప్పకుండా నడక ప్రారంభించాడు. అతని చెవుల్లో "సావుకి జడవకండి బాబూ! వద్దన్నా రాకమానదు- రమ్మన్నా రాదు" అన్న ముసలివాడి మాటలు గింగురుమంటున్నాయి.

అనుకోని ఈ పరిణామానికి అప్పన్న నిర్ఘాంతపోయాడు. నడుస్తున్న రామారావు కేసి చూస్తున్నాడు. క్షణంలో పది గజాల దూరంలో నడుస్తున్న రామారావు యెండకు యెదురయ్యాడు.

మరి కాసేపట్లో అప్పన్న కంటికి కూడా మరుగయ్యాడు

అగ్ని నక్షత్రం యెండ మరింత తీవ్రమైంది.